# అక్రమ క్లినిక్‌లపై వైద్య ఆరోగ్యశాఖ కొరడా



**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలో అక్రమ క్లినిక్‌లు, అనధికార వైద్య సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లా వైద్యాధికారి డా. స్వర్ణకుమారి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అక్రమ క్లినిక్‌లు, ల్యాబ్‌లపై తనిఖీలు ముమ్మరం చేశారు. తాజాగా హఫీజ్‌పేట్, నార్సింగి ప్రాంతాల్లో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు క్లినిక్‌లను సీజ్ చేశారు. హఫీజ్‌పేట్‌లోని RIA CLINIC & DI AGNOSTIC CENTREలో అధికారులు తనిఖీలు నిర్వహించగా, అనుమతులు లేకుండా వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా నార్సింగిలోని ప్రియదర్శిని క్లినిక్లోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. క్లినిక్‌ను నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించడంతో సీజ్ చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా DMHO డా. స్వర్ణకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా నిబంధనలకు మించి వైద్య సేవలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ క్లినిక్‌లు, అక్రమ ల్యాబ్‌లపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా అనధికారికంగా వైద్య సేవలు నిర్వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలో మరిన్ని అక్రమ వైద్య కేంద్రాలపై కూడా తనిఖీలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ తనిఖీల్లో డెమో గంగాసాని మంజుల, శ్రీనివాస్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షంతో డ్రైనేజీ సమస్య.. తక్షణమే స్పందించిన చైర్‌పర్సన్

❖ 12వ వార్డులో లోతట్టు ప్రాంతాల పరిశీలన.. శాశ్వత పరిష్కారానికి హామీ




**దశ, చౌటుప్పల్:** చౌటుప్పల్‌లో కురిసిన వర్షానికి 12వ వార్డులోని లోతట్టు ప్రాంతాల్లో తలెత్తిన డ్రైనేజీ సమస్యను మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి యాదవ్‌తో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించారు. సమస్యపై వెంటనే స్పందించిన చైర్‌పర్సన్ తాత్కాలిక మరమ్మతులు చేపట్టించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు.

## ముషీరాబాద్‌లో అక్రమ మెడికల్ షాప్‌పై TG SAFE–డ్రగ్స్ వింగ్ దాడులు




**దశ, హైదరాబాద్ :** ముషీరాబాద్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాప్‌పై TG SAFE-డ్రగ్స్ వింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో 32 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో గడువు ముగిసిన మందులు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ఔషధాల్లోని నమూనాలను అధికారులు విశ్లేషణ కోసం సేకరించారు. నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా మందుల విక్రయాలు చేయడం, అక్రమ ఔషధ కార్యకలాపాలకు పాల్పడటంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలను గుర్తించినట్లయితే 18005996969 నంబర్‌కు సమాచారం అందించాలని TG SAFE-డ్రగ్స్ వింగ్ అధికారులు సూచించారు.

## పాత రేషన్ కార్యాలయంలో స్మార్ట్ కార్డుల పంపిణీ



దశ ఓయూ: రెజిమెంటల్ బజార్‌లోని పాత రేషన్ కార్యాలయంలో శనివారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు ఏఎస్ఓ జి.వి. చాముండేశ్వరి తెలిపారు. అంబర్‌నగర్, వారాసిగూడ, మేడిబావి, బౌద్ధనగర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు ఇక్కడే కార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన వివరాల ప్రకారం పాత రేషన్ కార్యాలయానికి వచ్చి కార్డులు తీసుకోవాలని సూచించారు. పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.

## గణేష్ సురక్ష సంకల్ప్‌లో అవగాహన కార్యక్రమం



❖ మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళా భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల అవగాహన

**దశ, పెద్ద అంబర్‌పేట:** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు 'గణేష్ సురక్ష సంకల్ప్-2026'లో భాగంగా గురువారం సాయంత్రం పసుమాములలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాగోల్ సర్కిల్, పెద్ద అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పసుమాముల ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటికి దూరంగా ఉండాల్సిన అవసరంపై ప్రజలకు వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే చట్టపరమైన చర్యలను తెలియజేశారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలతో పాటు, వారికి వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు ఎదుర్కొనే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమం ముగింపులో ప్రజలతో చట్టాన్ని గౌరవిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సీఐ శంకరయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ టీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్, హయత్‌నగర్ ఎస్ఐ అరుణ్‌కుమార్, సహచరి సభ్యులు హైమావతి, ప్రమీల, సోగ్రా, ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చెట్టి రమేష్‌గౌడ్, పోలీసు సిబ్బంది, ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూపీఐపై విపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టిన బూర నర్సయ్య గౌడ్

❖ ఎండీఆర్ సామాన్యుడిపై భారం కాదు.. 95 శాతానికి పైగా లావాదేవీలకు మినహాయింపు: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు



**దశ, హైదరాబాద్ :** యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ (MDR) అంశాన్ని రాహుల్ గాంధీ, విపక్షాలు తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. 2016లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో ప్రారంభమైన యూపీఐ నేడు సామాన్యుడి చేతిలో ఆర్థిక మంత్రదండంలా మారిందన్నారు. యూపీఐ వ్యవస్థను 24 గంటలూ కొనసాగించేందుకు బ్యాంకులు, ఎన్‌పీసీఐ, సర్వర్లు, డేటా సెంటర్లు, టెలికాం నెట్‌వర్క్, సైబర్ భద్రత వ్యవస్థలు నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. యూపీఐకి ముందు కార్డులు, ఏటీఎంలు, డిజిటల్ వాలెట్ల ద్వారా లావాదేవీలకు వివిధ రకాల ఛార్జీలు ఉండేవని, యూపీఐతో తక్షణ నగదు బదిలీ సులభమైందని పేర్కొన్నారు.

ఎండీఆర్ అంటే 'మర్చెంట్ డిస్కౌంట్ రేట్' అని, రాహుల్ గాంధీ భావిస్తున్నట్లు 'మెంటల్ డిస్కౌంట్ రేట్' కాదని ఆయన ఎద్దేవా చేశారు. ఎండీఆర్ సాధారణ వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే లావాదేవీలకు వర్తించదని, వినియోగదారుడిపై నేరుగా భారం ఉండదని చెప్పారు. చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు సున్నా ఎండీఆర్ వర్తిస్తుందని పేర్కొన్నారు.

యూపీఐ ద్వారా భారీ మొత్తంలో డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న నేపథ్యంలో, వాటి వెనుక పనిచేస్తున్న సాంకేతిక మౌలిక వసతులు, భద్రతా వ్యవస్థల నిర్వహణకు అయ్యే ఖర్చును కూడా పరిగణనలోకి తీసుకోవాలని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ఎండీఆర్ ద్వారా వచ్చే మొత్తం ప్రభుత్వ ఖజానాకు లేదా బీజేపీకి వెళ్లదని, సంబంధిత బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల వ్యవస్థ నిర్వహణకు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదని ఆయన అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు రాజకీయ భేదాలు పక్కనపెట్టి సహకరించాలని విపక్షాలకు సూచించారు. ఈ అంశంపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని బీజేపీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

## AIPC చైర్‌పర్సన్‌గా మధుయాష్కీ..



❖ శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ అడ్వకేట్ గుండ్లపల్లి

**దశ, హైదరాబాద్:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (AIPC) జాతీయ చైర్‌పర్సన్‌గా నియమితులైన తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుగౌడ్ యాష్కీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఎల్.బి.నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ DNT, NT అడ్వకేట్స్ ఫోరం అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది గుండ్లపల్లి సత్యనారాయణ, లింగోజిగూడ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కందికంటి శ్రీధర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మధుయాష్కీని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది గుండ్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. వివిధ రంగాలకు చెందిన వృత్తినిపుణులు, మేధావులు, విద్యావంతులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేయడంలో మధుయాష్కీ గౌడ్ నాయకత్వం కీలకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. AIPC బాధ్యతలు మధుయాష్కీకి అప్పగించడం ద్వారా జాతీయ స్థాయిలో వృత్తినిపుణులతో మరింత విస్తృతంగా అనుసంధానం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఆయన నాయకత్వంలో సంస్థ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం మధుయాష్కీ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన గుండ్లపల్లి సత్యనారాయణ, కందికంటి శ్రీధర్ గౌడ్‌లు ఆయన నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, న్యాయవాదులు పాల్గొని మధుయాష్కీ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


## దానం నాగేందర్‌పై అనర్హత వేటు

❖ ఇది బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి దక్కిన విజయం
❖ రేవంత్ ఫిరాయింపు, చిల్లర రాజకీయాలకు ఇదే చెంపపెట్టు: మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటీ)



**దశ, హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటీ) హర్షం వ్యక్తం చేశారు. దానం నాగేందర్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన న్యాయ పోరాటానికి దక్కిన విజయమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో బంటీ మాట్లాడుతూ.. "రేవంత్ ఫిరాయింపు రాజకీయాలకు ఈ తీర్పు చెంపపెట్టు. న్యాయమే గెలిచింది. రాజ్యాంగం ముందు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అహంకారం బద్దలైంది" అని వ్యాఖ్యానించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ స్థానం నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన అనర్హత పిటిషన్లలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ హైకోర్టు పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని బంటీ తెలిపారు. హైకోర్టు తీర్పుతో తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు, ప్రజాస్వామ్య విలువలను కాపాడే విషయంలో బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందనే ధీమాను మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటీ) వ్యక్తంచేశారు.

## శిల్పి కాలనీలో ఘనంగా కుంకుమ పూజ





**దశ, పెద్ద అంబర్‌పేట:** పెద్ద అంబర్‌పేట పరిధిలోని శిల్పి కాలనీలో శుక్రవారం రాత్రి గణపతి మండపం వద్ద కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. చిన్నారులు, పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరై గణపతి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కాలనీలో భక్తి వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## భువనేశ్వర్ వెళ్లి వస్తానన్న వ్యక్తి అదృశ్యం



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలేశ్వర్ జిల్లా భద్రక్ పరిధికి చెందిన గౌరంగ్ సాహూ (60) కొంతకాలంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లోని ఇనామ్‌గూడలో అద్దె ఇంట్లో నివసిస్తూ రామోజీ ఫిల్మ్‌సిటీలో మెకానికల్ విభాగంలో పనిచేస్తున్నారు. సెప్టెంబర్ 5న మధ్యాహ్నం 12 గంటల సమయంలో గౌరంగ్ సాహూతో ఆయన కుమారుడు పరేష్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడాడు. తాను భువనేశ్వర్ నుంచి భద్రక్ వెళ్తున్నానని, వారం రోజుల్లో తిరిగి వస్తానని ఆయన చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆ తర్వాత పలుమార్లు ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ గౌరంగ్ సాహూ ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు పరేష్‌కుమార్ పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు క్రైమ్ నంబర్ 746/2026 కింద 'మ్యాన్ మిస్సింగ్' కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ర్యాపిడో ఆధీనంలోకి తాండూర్




- బైక్, ఆటోలు రాపిడ్ సొంతం
- కనీస చార్జ్ బైక్ 20,ఆటోకి 50
- సింగిల్ ఉంటే బైక్ కి అధిక ప్రాధాన్యం
- పడిపోయిన పెద్ద ఆటోల డిమాండ్
- తాండూర్ నుంచి ఎటు 30 కిలోమీటర్ల పరిధిలో ర్యాపిడో
- ప్రారంభంలోనే అదిరిపోతున్న ర్యాపిడో బుకింగ్స్



**తాండూర్, దశ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణ ప్రాంతం ఇప్పుడు పూర్తిగా ర్యాపిడో ఆధీనంలోకి వెళ్ళింది. వాహనాల ట్రాన్స్పోర్ట్ ప్రయాణికుల గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఎవరు చూసినా ర్యాపిడోనే బుకింగ్ చేసుకుంటున్నారు. ఆటోలకు కనీసం 50 రూపాయలుగా రేటు నిర్ణయించగా బైక్ కీ 20 రూపాయలుగా నిర్ణంచారు. ర్యాపిడో బిజినెస్ కి అడ్డగా మారింది. పలు ప్రాంతాల నుంచి తాండూర్ కు నిత్యం రాతకపోకలు చేస్తుంటారు. అదేవిధంగా తాండూర్ నుంచి ఇతర ప్రాంతాలకు కూడా నిత్యం వెళుతూ ఉంటారు. ఉదయం,సాయంత్రం పూట ఎక్కువగా రద్దీ ఉంటుంది. ఈ కారణంగా ఆటోలు,బస్సులు దొరకడం కష్టంగా మారుతుంది. దీనితో ర్యాపిడో తాండూర్ కి రావడంతో ప్రయాణికుల కష్టాలు తీరినవని కొంతవరకు చెప్పవచ్చు. అదేవిధంగా ర్యాపిడిలో చార్జి తక్కువగా ఉంటుంది. పైగా కోరిన సమయానికి వస్తుంది. కోరిన ప్రాంతానికి లొకేషన్ షేర్ చేస్తే వస్తుంది. ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది. దీనితో అందరూ ర్యాపోడో వైపే మొగ్గు చూపిస్తున్నారు.

## బిజినెస్ కి అడ్డా తాండూర్

**తాండూరు బిజినెస్ జరిగే ముఖ్యమైన ప్రాంతం. ఈ ప్రాంతంలో బండరాళ్లు, సిమెంట్ ఇండస్ట్రీలు, కందుల మార్కెట్,తదితరయి ఉన్నాయి. ర్యాపీడో రావడం తో ప్రయాణికులకు కొంతవరకు కష్టాలు తీరినాయని చెప్పవచ్చు. ఉదయం పూట, సాయంత్రం పూట రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో బస్సులు సమయానికి ఉండవు. ఆటోల వాళ్ళు ఎంత అడిగితే అంత చెల్లించవలసి ఉంటుంది. దీనితో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మధ్యతరగతి వారికి డబ్బులు లేకపోవడంతో ఇబ్బంది మరింత తీవ్రం అయ్యేది. దీంతో ప్రయాణికులకు ర్యాపిడో రావడంతో ఎంతో ఉపయోగం అయింది. బైక్ కీ ₹20 ఉండడంతో ఎక్కువమంది దాన్నే ఇష్టపడుతున్నారు.**

## రోజుకి 200 మంది యాప్ డౌన్‌లోడ్

**ర్యాపిడో యాప్ ని తాండూర్ ప్రాంతంలో సగటున రోజుకు 200 మంది డౌన్లోడ్ చేసుకుంటున్నారు. ఇందులో కొందరు ర్యాపిడో యాప్ ని వాడుతుంటే, మరికొందరు ర్యాపిడో కెప్టెన్ యాప్ వాడుతున్నారు.ఒకే మొత్తంగా చూస్తే 200 మంది డౌన్లోడ్ చేసుకుంటున్నట్టు తెలుస్తుంది. దీనితో తాండూరులో ర్యాపిడోకు ఎంత డిమాండ్ ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఇది ఇలాగే ముందు ముందు కొనసాగితే తాండూర్ లో కూడా ర్యాపిడో బుకింగ్ లు విపరీతంగా పెరిగిపోతాయి. ఉబెర్, ఓలా తదితర యాప్ లను కూడా డౌన్లోడ్ చేసుకుంటున్నారు. ఉదయం నాలుగు గంటలకే ర్యాపీడో రైడింగ్ లు ప్రారంభం అవుతున్నాయి. అప్పటి నుంచే ప్రయాణికులు బుకింగ్ చేసుకోవడం ప్రారంభిస్తున్నారు . సాయంత్రం పూట అయితే మరీ ఎక్కువగా డిమాండ్ ఉంటుంది.**

## శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఘనంగా విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు

❖ *గణనాథుడికి దీపాలు వెలిగించిన విద్యార్థులు*



**దశ ఓయూ:** చెంగిచెర్ల లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శుక్రవారం రాత్రి విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు గణనాథుడికి దీపాలు వెలిగించి, నైవేద్యాలు సమర్పించి మంగళ హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం 9 గంటలకు లడ్డూ వేలం నిర్వహిస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపారు. లడ్డు వేలం కార్యక్రమంలో స్కూల్ విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు హాజరు కావాలని తెలిపారు. పాఠశాల చైర్మన్ బుచ్చి రెడ్డి, డైరెక్టర్ సాయిరాం రెడ్డి, ప్రిన్సిపాల్ కేథరిన్ రెడ్డి మార్గదర్శకత్వంలో కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు భవాని, పి.సంధ్య, స్టెఫీ, అఫ్రీన్, గాయత్రి, దివ్య, నవ్య, అమిత, శ్రావ్య, నందిని, అలియా పర్వీన్, అబ్దుల్ అఫీజ్, ఉమాదేవి, తహెరా సుల్తానా, నాగమణి, కె.స్వాతి, దామోదర్, మనీషా, అపర్ణ, అనిత, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట నెక్సా షోరూమ్ లో సరికొత్త బాలెనో ఆవిష్కరణ



**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేటలోని నెక్సా పవన్ మోటార్స్ షోరూమ్ లో ది స్టన్నింగ్ న్యూ బాలెనో కారును జిల్లా కేంద్రంలోని హైటెక్ బస్టాండ్ సమీపంలో మాజీ తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి , ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి లు శుక్రవారం హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జపాన్ కు సంబంధించిన కారును సంజయ్ గాంధీ ఆలోచన మేరకు సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇండియాకు తీసుకురావడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. మారుతి సుజుకి ఈ సందర్భంగా పవన్ మోటార్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ, "నెక్సా అంటేనే స్టైల్, టెక్నాలజీ, సోఫిస్టికేషన్. ఈ కొత్త బాలెనోలో అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్, భద్రతా ప్రమాణాలు ఉన్నాయి. సూర్యాపేట వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. కొత్త బాలెనో డార్క్ బ్లూ షేడ్ లో ఆకర్షణీయంగా ఉండి, చూపరులను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, ఉమ్మడి నల్లగొండ హెచ్ఆర్ సిహెచ్, సుధాకర్, సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ డి, నరేష్, కంపెనీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపంలో ప్రత్యేక పూజల్లో.. అడిషనల్ డీసీపీ వెంకటరమణ..



**దశ, ఓయూ:** బాబునగర్‌లో బాలగంగాధర్ తిలక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నాచారం సీఐ ధనుంజయ్, ఎస్సైలు భాస్కర్, గోవర్ధన్, అసోసియేషన్ అధ్యక్షుడు దేవా, సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## శ్రీ మణికంఠ నగర్‌లో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



**దశ, ఓయూ:** శ్రీ మణికంఠ నగర్ కాలనీలో నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు స్వామివారికి కుంకుమార్చన విఘ్నేశ్వరునికి మంగళహారతులు భక్తి శ్రద్ధలతో భక్తి భావంతో పాటలు పాడుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ మండపానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. స్వామివారి అన్నదాన కార్యక్రమంలో శ్రీ మణికంఠ కాలనీ వాసులు మహిళలు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి

❖ *కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి డిమాండ్*



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ ఏర్పాటు కోసం సూర్యాపేటలో చేపట్టిన బంద్, భారీ ర్యాలీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు. బుల్లెట్ ట్రైన్ మార్గానికి సంబంధించిన పాత అలైన్‌మెంట్‌నే యథాతథంగా కొనసాగించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సూర్యాపేట బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ ఏర్పాటు సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అఖిలపక్ష నాయకులు, పట్టణ వ్యాపారులు, వివిధ రంగాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత అలైన్‌మెంట్ తెలంగాణకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదన్నారు. చౌటుప్పల్-సూర్యాపేట-కోదాడ మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని ఏర్పాటు చేస్తే నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. జనసంచారం లేని మార్గంలో రైల్వే లైన్‌ను తీసుకెళ్లడం వల్ల తెలంగాణకు ప్రయోజనం ఉండదని ఆయన అన్నారు. సకల జనుల ఆకాంక్ష మేరకు బుల్లెట్ ట్రైన్‌ను ఎన్‌హెచ్-65 హైదరాబాద్-విజయవాడ రహదారికి సమాంతరంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాత అలైన్‌మెంట్‌ను సాధించే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని జగదీష్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించి ర్యాలీలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సూర్యాపేట ప్రజల ఆకాంక్ష మేరకు జేఏసీ చేపట్టే ప్రతి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేగా తనవంతు మద్దతు ఉంటుందని తెలిపారు.

## అడ్డగుట్టలో వినాయక మండపాల సందర్శన..





❖ *బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి*

**దశ, ఓయూ:** మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి అడ్డగుట్టలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీచర్స్ కాలనీ అసోసియేషన్, సేవాలాల్ మహరాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాలతో పాటు పలు మండపాల్లో గణనాథుడిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.